WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, డిసెంబర్ 15, 2025

## అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మార్గశిర మాసంలో చలి తీవ్రత విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వరంగల్ నగరంలో శ్రీ వెంగమాంబ సేవాసమితి మరోసారి తమ ఉదారతను చాటుకుంది. చలికి వణుకుతున్న అనాథలు, వృద్ధులు, అభాగ్యులను రక్షించాలనే సదుద్దేశంతో, ఆదివారం అర్ధరాత్రి వేళ ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ వారికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు శ్రీ వెంగమాంబ సేవాసమితి అధ్యక్షుడు దివ్వెల పూర్ణచందర్ ఆధ్వర్యంలో సభ్యులు జేపీఎన్ రోడ్, చౌరస్తా, స్టేషన్ రోడ్డు, రైల్వే స్టేషన్, సీకేఎం ఆసుపత్రి, దుర్గేశ్వరస్వామి దేవాలయం వీధి, గోపాలస్వామి గుడి, రామ్ లక్ష్మణ్ థియేటర్, బట్టల బజార్ తదితర ప్రాంతాలలో నిరాశ్రయులైన సుమారు 60 మంది వృద్ధులు, అనాథలు, అభాగ్యులకు స్వయంగా దుప్పట్లను అందజేశారు. చలి పులి బారినుంచి దుకాణ సముదాయాల్లో అరుగులపై వణుకుతూ నిద్రిస్తున్న అభాగ్యులను, రైల్వే స్టేషన్ ఆవరణలో నిరాశ్రయులైన వారిని రక్షించాలనే సదుద్దేశంతోనే ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకుడు దివ్వెల పూర్ణచందర్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో సభ్యులు యాద శ్రీనివాస్, గుండా సురేష్, కె.మధుసూదన్, దేవా శ్రీనివాస్, చకిలం శరత్, వై.చంద్రయ్య, జి.బుచ్చన్న, పి.ప్రకాష్, వి.రేవంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు ప్రజా సేవకులు



**వరంగల్ వాయిస్, వేలేరు :** క్లిష్ట సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం పోలీస్ అధికారుల బాధ్యతగా స్వీకరిస్తారని నిరూపించడానికి నిదర్శనంగా... హన్మకొండ జిల్లా వేలేరు మండలంలో ఆదివారం జరిగిన రెండవ దఫా సర్పంచ్ ఎన్నికల్లో వరంగల్ పోలీస్ అధికారి అడిషనల్ కమాండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పలు గ్రామాలను సందర్శించి, ప్రజలకు అద్భుతమైన సేవలు అందించారు. శాంతి భద్రతల రక్షణ కోసం విధులు నిర్వహిస్తూనే, వృద్ధులు మరియు నడవలేని వారిని ఓట్లు వేయించడానికి వీల్ చైర్ల సహాయంతో సహకరించిన తీరు మండలంలోని ప్రజలను అబ్బురపరిచింది. ఓటు హక్కు విలువ తెలియాలనే ఉద్దేశంతోనే ఈ సేవలు చేసినట్లుగా పోలీస్ అధికారులు తెలిపారు. వృద్ధులకు ఓటు వేయడంలో సహకరించిన విధానం, దగ్గరుండి ఓట్లు వేయించిన విధానం అద్భుతం అని గ్రామస్తులు అభినందిస్తున్నారు. అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్ వేలేరు మండలంలోని పలు గ్రామాలలో జరిగిన ఎన్నికలను విస్తృతంగా పర్యవేక్షించారు. కమ్మ రైపేట్, ఎర్రబెల్లి, శాలపల్లి, పిచర్ల, మద్దెలగూడెం, కన్నారం, శుదనపల్లి, మల్లి కుదుర్ల, గుండ్ల సాగర్, బంధాతండా గ్రామాల్లో ఎన్నికలు పూర్తయ్యే వరకు తన సిబ్బందిని ఉపయోగించి పలుచోట్ల సేవలు అందించడం ప్రజాసేవ పట్ల పోలీస్ ఉదారతను మరోసారి చాటిచెప్పినట్లుగా ఉంది. ఈ సేవా కార్యక్రమంలో కన్నె రాజు, సిమ్మర్ రాజు సహా సిటీ గార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోమాతలకు దాన బస్తాల వితరణ



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాల గోమాతలకు బోనాల ఉమాదేవి రాజమౌళి దంపతుల కుమారుడు ప్రబోధన్ అనులేఖ నూతన దంపతులు సోమవారం గోశాల గోమాతలకు దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గోశాల గోమాతలకు దాన బస్తాలను అందజేసిన దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# "ఓటు మీది – అభివృద్ధి నాది"

**• నర్సింహులపల్లి సర్పంచ్ అభ్యర్థి ముసుకు క్రిష్ణ**

**వరంగల్ వాయిస్, శాయంపేట :** నర్సింహులపల్లి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు తనకు సర్పంచ్‌గా ఒక్క అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ముసుకు క్రిష్ణ గ్రామ ప్రజలను అభ్యర్థించారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అడుగుజాడల్లో నడుస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రచారంలో భాగంగా పలు కీలక హామీలను ప్రకటించారు. గ్రామ శివారు నుంచి కౌకొండ గ్రామం వరకు అత్యవసరమైన ఒర్రెబాట నిర్మాణాన్ని ఎమ్మెల్యే సహకారంతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తానని తెలిపారు. గ్రామంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలందరికీ ప్రభుత్వ 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం ద్వారా గృహాలను మంజూరు చేయిస్తానన్నారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తానని పేర్కొన్నారు. ముఖ్య కూడళ్లలో హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేస్తానన్నారు. అర్హులైన గ్రామస్తులందరికీ వివిధ రకాల పింఛన్లు (వితంతు, వృద్ధాప్య, వికలాంగుల) అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజల ఆరోగ్య బాగోగుల కోసం ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని నెలకొల్పడంతో పాటు పోచమ్మ తల్లి , చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తామని చెప్పారు. గ్రామంలో మహిళా సంఘాలకు శాశ్వత భవనాన్ని ఎమ్మెల్యే గారి సహకారంతో నిర్మించేలా కృషి చేస్తానన్నారు. గ్రామంలో పండుగలు సందడిగా జరిగేలా సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. "ఓటు మీది – అభివృద్ధి నాది" అనే నినాదంతో ముందుకు సాగుతున్న తనను గ్రామ ప్రజలు మీ బిడ్డగా ఆశీర్వదించి, అమూల్యమైన ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని ముసుకు క్రిష్ణ విజ్ఞప్తి చేశారు.



### ఓటర్లను ఆకట్టుకుంటున్న హామీలు..

గ్రామాభివృద్ధికి పాటుపడేందుకు తనకు అవకాశం ఇవ్వాలని నర్సింహులపల్లి సర్పంచ్ అభ్యర్థి ముసుకు క్రిష్ణ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అండదండలతో గ్రామ సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఒర్రెబాట, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా భవనం, ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరం, ఆలయాల అభివృద్ధి, నూతన పంచాయతీ భవనం నిర్మాణం ప్రధాన హామీలుగా నిలిచాయి. "ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. ఓటు మీది – అభివృద్ధి నాది" అంటూ ఆయన ప్రచారం చేస్తూ గ్రామ ప్రజలందరికీ ఆకట్టుకుంటున్నారు.

### అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..

గ్రామాభివృద్ధి తన లక్ష్యమని, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో నర్సింహులపల్లి రూపురేఖలు మారుస్తానని సర్పంచ్ అభ్యర్థి ముసుకు క్రిష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తానని క్రిష్ణ స్పష్టం చేశారు. "నేను మీ బిడ్డగా గ్రామ సర్పంచ్‌గా గెలిస్తే, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అడుగుజాడల్లో నడుస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేసి, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా. రోడ్లు, డ్రైనేజీలు, పేదలకు ఇళ్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానంటున్నారు.





## కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లాను కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి ఇంటిలో సర్వే నిర్వహించి, కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించి, లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, వారికి తగిన పరీక్షలు, చికిత్సలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నివారణ కోసం ఈనెల 18 నుంచి 315 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు గృహ సందర్శన చేస్తారు. అనుమానిత మచ్చలు ఉన్నవారిని పరీక్షించి, వెంటనే వైద్యాధికారి ద్వారా పరీక్షలు నిర్ధారణ చేయించి, వారికి కావలసిన కుష్ఠు నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, శిక్షణ పొందిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని డీఎంహెచ్ఓ కోరారు. కుష్ఠు వ్యాధి సాధారణంగా వచ్చే ఇతర వ్యాధుల మాదిరిగానే నయమయ్యే వ్యాధి అని, దీనిని ఎవరూ కూడా నిర్లక్ష్యం చేయకుండా తగిన చికిత్సలు తీసుకుంటే తప్పకుండా నయమవుతుందని డాక్టర్ సాంబశివరావు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు తగు చికిత్సలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి సిబ్బందికి నిర్వహించిన శిక్షణానంతరం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్ సర్వేకి సంబంధించిన మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, డిప్యూటీ డెమో అధికారి అనిల్ కుమార్, డీపీఎంఓలు అనుపమ, వెంకన్న, జయరాజ్, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చల్లాను కలిసిన వెంకటేశ్వర్లపల్లి నూతన పాలకవర్గం



**వరంగల్ వాయిస్, నడికూడ:** మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో నడికుడ మండలం, వెంకటేశ్వర్లపల్లి గ్రామ సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిచిన పెండ్యాల మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని హనుమకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం మాజీ ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి, తమ గెలుపుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మీ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని నూతన పాలకవర్గం ఈ సందర్భంగా తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మందోటి రాజు, వార్డు సభ్యులు ఇందుజ, చికిల సునీత, గాజుల వెంకటేష్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.